# వచన కవితా యుగకర్త కుందుర్తి

# VACHANA KAVITHA YUGAKARTHA KUNDURTHI

**Dr. N. Amber Singh**
*Asst.Professor, Girraj Govt College (A), Nizamabad*

"వచన కవిత విచారణలో ఉరిశిక్షపడ్డ
మొదటి ముద్దాయిని నేను
అలనాటి కవితా లతాంగిని హత్య చేశాను
అలంకార ఆభరణాలు అపహరించాను
అన్నీ ఒప్పేసుకున్నాను ఆనాడు బోనులో ఎక్కి
క్రింది కోర్టు వేసిన శిక్షను
మానవ కారుణ్య దృక్పథంతో సడలించి
జన్మ ఖైదు వేశారు హైకోర్టు న్యాయమూర్తులు
ఒక తరం పాటు బ్రతకాలన్నారు బందీగా
పాఠకుల గుండెల చెరసాలలో"

అని సగర్వంగా చెప్పుకోగలిగిన చరిత్ర కుందుర్తిది. వచన కవితకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన వచన కవితోద్యమనేత కుందుర్తి ఆంజనేయులు. అందరికీ కుందుర్తిగానే సుపరిచితం. వచనకవితను ఊపిరిగా శ్వాసించి, ఆ ప్రక్రియకు ఉద్యమస్థాయిని కల్పించి, పాఠకుల గుండెలో చిరస్థాయిగా ఉండేట్టు చేసిన నిరంతర వచన కవితా కృషీవలుడు కుందుర్తి. ఈనాడు వచన కవిత్వం ఇంతగా వ్యాప్తి చెందడానికి తన జీవితాన్ని ధారపోసాడు. పద్యం గగనవీథిలో విహారం చేస్తున్న రోజుల్లో ఛందస్సును ఎదిరించి నిలదీసాడు. వచన కవితా బావుటాను ఎగురవేసిన "వచన కవితా పితామహుడు" కుందుర్తి ఆంజనేయులు. వచన కవితను తన జీవిత ధ్యేయంగా స్వీకరించి, స్వయంగా 'ఫ్రీవర్స్ ఫ్రంట్'ను స్థాపించాడు. ఊరూరా తిరిగి, కవిత్వం రాసి, పీఠికలు రాసి, వచన కవితకు సిద్ధాంతాలు చేసి, వచన కవితపై రాద్ధాంతాలు చేస్తున్న వారి నోళ్ళు మూయించి...

"పాతకాలం పద్యమైతే
వర్తమానం వచన గేయం" అని ధైర్యంగా చాటాడు.

1922 డిసెంబర్ 16న గుంటూరు జిల్లా నరసరావు పేటలోని కోటావారి పాలెంలో రామయ్య, నరసమ్మలకు జన్మించాడు. ఎనిమిదో తరగతి వరకూ వినుకొండలో చదివాడు. అక్కడే జాషువా తెలుగుబోధకుడుగా ఉండేవాడు. ఆయన కవిత్వానికి ఆకర్షితుడయ్యాడు. విజయవాడ ఎస్.ఆర్.ఆర్. కళాశాలలో ఇంటర్మీడియేట్ చదువుతుండగా విశ్వనాథ సత్యనారాయణ శిష్యుడుగా ఉన్నాడు. ఆయన ప్రభావంతో ప్రాచీనకవిత్వ పఠనం అలవడింది. పద్య

కావ్యాలు, ప్రేమ కావ్యాలు రాశాడు. 1941-43లో గుంటూరు ఏ.సి. కాలేజీలో బి.ఏ. చదివాడు. నరసరావుపేటలో నవ్యకళాపరిషత్తు స్థాపించాడు. కమ్యూనిస్టు భావాలవైపు ఆకర్షించబడ్డాడు. కొంత కాలంలో తెనాలిలో ఆంగ్లోపాధ్యాయునిగా, ప్రిన్సిపాల్‌గా పనిచేశాడు. 1956లో రాష్ట్ర ప్రభుత్వ సమాచారశాఖలో అనువాదకునిగా కర్నూలులో పనిచేశాడు. ఆ తర్వాత హైదరాబాదుకు బదిలీ అయ్యాడు. 1967లో 'ఫ్రీవర్స్ ఫ్రంట్' నుండి యువతలో వచన కవిత్వాన్ని ప్రోత్సహించడానికి ఉత్తమ వచన కవిత్వానికి బహుమతినిచ్చే సంప్రదాయాన్ని నెలకొల్పాడు.

పేద కుటుంబంలో పుట్టి మధ్య తరగతి, పేద, బడుగు వర్గాల జీవన స్థితిగతులను కళ్ళారా చూసి, కర్షక, కార్మిక బతుకు వెతలను, చాలీచాలని జీవితాలను అధ్యయనం చేసి, పదునైన కవిత్వాన్ని వెలువరించాడు. తెలంగాణ సాయుధపోరాటంలో పాల్గొన్న వీరులు, వీరనారీమణులు అనుభవించిన సాధక బాధకాలు, ఆనాడు నిజాం పోలీసులు, రజాకారులు వారిపట్ల అనుసరించిన అమానవీయ పద్ధతులు, అమానుషమైన చర్యలను తన కవిత్వంలో చిత్రించాడు. అదే 'తెలంగాణ' కావ్యం. ఈ కావ్యంలో కాలం, మార్పు, ఉద్యమం, జనశక్తి, సంఘర్షణ లాంటి భావాలు అంతఃప్రవాహాలుగా ఉంటాయి. ప్రజా చైతన్యం ఇందులోని ప్రధానాంశం.

కుందుర్తి ఇతర కవులైన బెల్లంకొండ రామదాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యంలతో కలిసి ఒక్కొక్కరూ మూడేసి ఖండ కావ్యాల చొప్పున రాసి సంకలనంగా చేసి 1944లో ప్రచురించిన కవితా సంకలనం 'నయాగరా' అభ్యుదయ కవితా ప్రస్థానంలో ఒక మైలురాయి.

"అన్యాయం అక్రమమూ
సంఘంలో చదరంగం
పరస్పరం దొమ్మి దోపిడీ
ఆరంభించని
ఆదియుగంలా
మంచిమీద బ్రతకమంది
అందరికీ
అవకాశాలూ
సరిపోయే వస్తూత్పత్తి
పంపిణీలో సమానభాగం
కోరుకొను హక్కుందట" (నయాగరా)

అంటాడు కుందుర్తి. ఈ సంకలనంలో పూర్వ సమాజ వ్యవస్థను తీవ్రంగా దుయ్యబడుతూ కవిత్వం రాసాడు. ఎర్రజెండా నాయకత్వాన సమసమాజ స్థాపన జరగాలని కుందుర్తి ఆశించాడు. దాని కోసం సాహిత్యంలో కూడా సాంప్రదాయం పోవాలని వచన కవిత వెలగాలని బలంగా నమ్మాడు ఆంజనేయులు. కావ్యభాష సంకెళ్ళను ప్రజలు తెంచుకొని వచన కవితా మాలలను ధరించమన్నాడు. శవాకారంగా ఉన్న కవి సమయాలను, నేటి కాలానికి రుచించని, అక్కర్లేని పాండిత్య ప్రకర్షా.. విషయ సంపదలనూ వ్యతిరేకించమన్నాడు. సాహిత్యంలోని

మారుతున్న విలువలకనుగుణంగా రూపంలో మార్పు తప్పదని చెప్పాడు. ఆయన ఆలోచనలు యువతను బాగా ఆకర్షించాయి. వారు వచన కవిత్వంవైపు మళ్ళేటట్టుచేశాయి. వచన కవితకు కుందుర్తి స్వయంగా చాలా సందర్భాలలో నిర్వచనాలనిచ్చాడు.

"వచన గేయానికి మొట్టమొదటి లక్షణం నిరాడంబరత. వచన గేయాన్ని కుంటుపడనీయకుండా ఆద్యంతం చేయగల సొగస్సు, విసురు అలవరచటం ఛందోబద్ధమయిన పద్యరచన కంటే కష్టమయిన పని – వచన గేయంలో ఒక ఉపమానాల విషయంలోనే కాదు ఇతర సందర్భాలలో కూడా ఈ విసురు ఒక ముఖ్య లక్షణంగా ప్రతిపాదిస్తున్నాను" – (1958 – చేకూరి రామారావు వ్యాసం).

"వచన గేయానికి ఒక స్థిరత్వం, స్థిమితత్వం ఏర్పడాలంటే పంక్తి నిర్మాణంలో ఒక తూగు కూడా అవసరం" – (1967– చేకూరి రామారావు వ్యాసం).

"మాత్రా ఛందస్సు వల్లా, కావ్య భాషా గుణం వల్లా వచ్చిన ఊపూ, విసురూ తెలుగు నుడికారపు సొంపువల్ల తేవాలనే ప్రయత్నం వచన గేయంగా రూపొందింది" – (1969– చేకూరి రామారావు వ్యాసం).

వచన కవితకు జీవితాన్ని అర్పించిన కుందుర్తి వచన కవితను ఎంతగా ఆరాధించినా గానీ ప్రాచీన సాహిత్యం పట్ల గానీ, పద్యం పట్ల గానీ తక్కువ భావనను ప్రదర్శించలేదు. పద్యాన్ని కించపరచలేదు. ఆయన మాటల్లోనే నియమబద్ధమై నన్నయాదుల చేత తీర్చిదిద్దబడిన పద్యం మాకు తల్లి. దానిని కించపరచాలనే ఉద్దేశం లేదు. కాని తెనుగు కవిత్వానికి ఈ పద్యమే, ఈ వృత్తమే తుది స్వరూపమని మాత్రం అంగీకరించం. కొత్త ప్రయోగం నిరంతరం జరగవలసిందే – (తెలుగు సాహిత్యచరిత్ర).

కొత్తనీరు రాని కోనేరు పసరెక్కుతుందన్నట్టుగా సాహిత్యంలో ఉన్న మూసభావజాలాలను కడిగేసే కొత్త భావాలు రావాలి. ఆ భావాలు ప్రజల్లోకి వెళ్ళాలంటే ప్రక్రియలో కూడా మార్పు రావాలని కోరుకున్నాడు. కోరుకున్నట్టే దానికై స్వయంగా కృషి చేశాడు. ఈ మార్పు అన్నింట్లో ఉండాలనుకున్నాడు. 'ఎప్పటికొస్తుంది మార్పు' అన్న కవితలో సమాజంలో నూత్న పరిణామాలను ఆశించాడు.

"చంద్రుడూ సూర్యుడు చెరి సగంగా పంచుకున్నాడు. మార్పులేని నాయకత్వం సరే మనలాగే ఉంది గాని ఏ కాలం రాత్రింబవళ్ళు ఇక్కడిలాగే చుక్కల ప్రజలు అజ్ఞానపు చీకట్లలో నిద్రిస్తూనే ఉంటారా?

నింగిలో కనిపిస్తున్న రకరకాల రంగులు జెండాలవైతే
అక్కడ మనలాగే
బహుపక్ష ప్రజాస్వామ్యం ప్రవర్తిల్లుతోందా?
........
మరి మార్పెప్పుడూ
స్పర్థల వాన వెలిసేదెప్పుడూ
నాలుగు దిక్కులూ కలిసేదెప్పుడూ" – (మేఘమాల)

అభ్యుదయవాదులెప్పుడూ సాంప్రదాయాన్ని మార్చాలని చూసినమాట నిజమే ఎందుకంటే మనలో అనాదిగా ముసురుకున్న కొన్ని కారుచీకట్లను తొలగించాలంటే ఇది అవసరమే. దానికై నూతన సాహిత్య సృష్టి అవసరమే అదే అభ్యుదయ కవులు కోరుకున్నది.

'తెలంగాణ' కావ్యంలో తెలంగాణ పరిస్థితిని అవగతం చేసుకున్నవాడై, ఇక్కడి వారసత్వాన్ని, సంస్కృతిని ఈ మట్టిమనుషుల మనస్తత్వాన్ని అర్థం చేసుకుని కుందుర్తి రాసిన కవిత 'సింహాసన'.

"అవి పావన గోదావరి జలాలు
అభిషేకించిన కమ్మని పొలాలు
కాదవి – నిరంతర దరిద్ర జీవితాలు
వలయించిన అమాయకుల నిలయాలు" (తెలంగాణ)

తెలంగాణ గోదావరి స్తన్యధారల్ని గ్రోలి, బంగారాన్ని పండించిన నేలని బయటి ప్రపంచం అనుకున్నట్టు ఇక్కడి ప్రజలు దరిద్రులు కారని, పాలకుల దౌష్ట్యానికి బలైన అమాయక హరిణాలంటాడు కవి.

"నిండారిన శశిమండల గతమై హరిణం కొమ్ములవంక ఈ దేఘశ జలధిగర్భంలో హైదరాబాదు ఒక లంక" అంటాడు. హైదరాబాదు ఒక లంకైతే దాన్ని పాలించే రావణుడు నిజాం. స్వార్థం కోసం ప్రజలను మోసం చేసేవారిని అణచివేసి తెచ్చిపెట్టుకున్న సింహాసనమదని అంటాడు. పరరాజులు ఈ నేలలో నిలద్రొక్కుకునేందుకు బలంగా చేసిన సహకారానికి నిజాంలకు ఒక జానెడు నేల ప్రతిఫలంగా వచ్చిన సింహాసనం హైదరాబాదు. ఒక జాతికి చేసిన ద్రోహానికి ఆచంద్రతారార్కం చరిత్రలో నిజాంల పేరు నీచప్రద్రోహిగా ఆచంద్రతారార్కం నల్లగా నిలిచిపోతుందని చెప్పాడు కుందుర్తి.

'ప్రజోద్యమ' కవితలో అన్యాయం, అక్రమం ఎల్లకాలముండబోవని, అణచివేతతోనే తిరుగుబాటు పుడుతుందని అంటాడు. పరిణామశీలమైన జగత్తులో ఓడలు బండ్లు, బండ్లు ఓడలౌతాయని, అధర్మం ఎప్పటికైనా పునాదులతో సహా పెకలించబడుతుందని ఆశిస్తాడు.

"రాజుల నవాబుల కోసం
కాలం ఆలస్యంగా నడవదు
అణగారిన దరిద్ర జీవితాల మీద
చైతన్యానికి యెంతో మక్కువ
మన కాలంలో అన్ని యంత్రాల లాగే
చరిత్రకూ వేగం ఎక్కువ
ఏరోజుకారోజు రాజుగారి కొలువులో
వెట్టి చేసేవాడు
ఏపూటకాపూట నిండని కడుపును
నిందించుకునేవాడు

చరిత్ర రథ చక్రగమనాన్ని
శాసించబూనుకున్నాడు" (తెలంగాణ)

హైదరాబాదును పరిపాలించిన ఏడవ నిజాం నవాబు 'మీర్ ఉస్మాన్ అలీఖాన్' నుంచి ప్రజలు విముక్తి పొందడానికి 1946 నుండి 1948ల మధ్య వీరోచితమైన పోరు చేశారు. దీన్నే తెలంగాణ విమోచనోద్యమమని పిలుస్తారు. రెండు వందల సంవత్సరాల దోపిడి, అణచివేతకు నలభై ఏడు సంవత్సరాల తిరుగుబాటు, సాయుధపోరాటం ఒక దశ మాత్రమే. వివిధ సంఘాల, పార్టీల, ప్రజాస్వామికవాదుల, రచయితల, ప్రజల సంఘటిత క్రమ-పరిణామ పోరాటమిది. బానిసత్వంలో కూరుకుపోయిన ప్రజలు బరిసెలుగా మారి తమ సంకెళ్ళను తెంచుకున్న సందర్భాన్ని కళ్ళకు కట్టాడు కుందుర్తి.

సౌప్తికమనే పద్యకావ్యం, ఇతర వచన రచనలు, పీఠికలు తప్ప, రసధుని, అమావాస్య, నా ప్రేయసి, నయాగరా, తెలంగాణ, నగరంలో వాన, హంస ఎగిరిపోయింది, మేఘమాల ఇలా అన్నీ వచనరచనలే చేశాడు కుందుర్తి.

తన జీవితాంతం వచన కవితోద్యమానికి వెచ్చించిన కుందుర్తి ఆశయమొక్కటే. కవితాశైలి సామాన్య ప్రజలకు చేరువకావాలి. ప్రతి పాఠకుడు కవిత్వాన్ని ఆస్వాదించే స్థాయిని రాయగలిగే స్థాయికి చేరాలి.

గొప్పగొప్ప కావ్యాలూ, కథా కావ్యాలూ, కవితా నాటకాలూ, నాటికలూ రావాలి. ప్రతిపౌరుడు ఆత్మాశ్రయ తత్త్వాన్ని వదులుకొని మార్క్సిజంవైపు మరలాలి. తద్వారా నూతన సమాజ నిర్మాణం జరగాలి. దానికి వచన కవిత్వమే ప్రధాన సాధనంగా భావించాడు కుందుర్తి. ఆయన ఉద్దేశంలో వచన కవిత్వానికి వ్యాకరణం, నిఘంటువు, అలంకారాలన్నీ ప్రజలే. సంస్కృత పదజాలాన్ని, ఆంగ్ల పదాడంబరాలను పరిహరించుకునే కవిత్వం రాయాలంటాడాయన. అద్దేపల్లి రామమోహనరావు అన్నట్టు "సాంప్రదాయికమైన ఇమేజెస్‌ని శిల్పపరంగా వినియోగించుకున్న అభ్యుదయ కవులలో కుందుర్తి విశిష్టుడు. సమకాలీన మానవునిలో ఉన్న కుళ్ళునీ, కపటాన్నీ బహిర్గతం చెయ్యడానికి విశిష్ట విధానం అవలంబించాడు" (తెలుగు సాహిత్యచరిత్ర).

యువతకు ఆదర్శంగా నిలిచి వారిచేత కవిత్వం రాయించి, కవిత్వ పోటీలను పెట్టి వారిని ఉత్సాహపరచి మానవతావాద కవిత్వంతో అందర్నీ ఆకట్టుకున్నాడు.

వచన కవిత్వానికి పర్యాయపదంగా మిగిలిపోయాడు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాన్ని ధారపోసి ఊరూరా తిరిగి, వచన కవిత్వాన్ని ప్రచారం చేసిన కుందుర్తిని 'వచన కవితా యుగకర్త'గా అభివర్ణిస్తే అది అతిశయమేమి కాదు.

ఆయన 1982 అక్టోబరు 25న కన్నుమూశాడు. ఆయన మరణం తర్వాత ప్రముఖ సాహితీ సమితి రంజని ఆయన పేరిట 1984 నుంచి ఇప్పటికీ ఏటేటా వచన కవితల పోటీ నిర్వహించి అవార్డులు ఇస్తూనే ఉంది.

ఆయన మరణించిన తర్వాత కూడా యువకవులకు ఈవిధంగా స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన ఘనత ఆయనది. వచన కవిత్వమున్నంత వరకూ కుందుర్తి ముద్ర, ఆకాంక్ష నిలిచే ఉంటాయి.

**ఆధార గ్రంథాలు :**

1. మేఘమాల
2. నయాగరా
3. తెలంగాణ
4. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా.శాస్త్రి.
5. te.wikipedia.org/wiki/
6. m.andhrajyothy.com/telugunews/abnarchievestorys-480994.
   (వచన కవితకు ప్రాణం పోసిన కుందుర్తి)
7. prajasakti.com/vacana-kavitalataolaidaipatai-kaumdouratai.
8. చేకూరి రామారావు వ్యాసం.

***